పేదల సంక్షేమమే ధ్యేయం

తాండూర్, జూలై 18 : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అంతకుముందు మండల కేంద్రంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కొత్తపల్లి ఇందిరమ్మ కాలనీవాసులు తమ సమస్యలు పరిష్కరించాలని, రేచిని గ్రామ గంగపుత్రులకు సభ్యత్వాలు ఇప్పించాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ ఏ రవికుమార్, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో పీ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఎంపీవో అక్తార్ మోహియొద్దీన్, ఏపీవో నందకుమార్, నాయకులు సిరంగి శంకర్, సూరం రవీందర్‌రెడ్డి, గట్టు మురళీధర్‌రావు, ఎండీ ఈసా, కడారి రత్నాకర్‌రావు, సల్వాజి మహేందర్‌రావు, పేరం శ్రీనివాస్, కాపర్తి సుభాష్, మామిడాల రాజేశం, మాసాడి తిరుపతి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో..

బెల్లంపల్లి, జూలై 18 : బెల్లంపల్లి తహసీల్ కార్యాలయంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ, మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని శ్రావణ మాసంలో ప్రారంభించి, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పష్టం చేశారు. పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ప్రిన్సిపాల్ రమాదేవి ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, ఆర్డీవో హరికృష్ణ, కౌన్సిలర్లు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

తాండూర్, జూలై 18 : నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ చేపడుతున్నామని తాండూర్ సీఐ కే కుమారస్వామి తెలిపారు. తాండూర్ ఐబీ సుభద్ర కాలనీలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో సీఐ గురువారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమతి పత్రాలు లేని బైకులతో పాటు, ఆటోలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని, నేర నియంత్రణలో భాగస్వాములవ్వాలని సూచించారు. ఎస్ఐ ఈ కార్యక్రమంలో సీహెచ్ కిరణ్‌కుమార్, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

'ఆరోపణలు అవాస్తవం'

తాండూర్, జూలై 18 : అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశామని కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు జాడి పోశం, సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం తాండూర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 40 ఏండ్ల క్రితం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇటీవల నేషనల్ హైవే 363 రోడ్డు నిర్మాణ పనుల సమయంలో విగ్రహాన్ని అంగడివద్దకు తరలిస్తుండగా, విగ్రహం కొన్నిచోట్ల శిథిలమైందన్నారు. అక్కడ ఎలాంటి రక్షణ లేకుండా విరిగిపోయిన విగ్రహాన్ని అందరి దృష్టికి తీసుకెళ్లి, వేరే చోటుకి తరలించామని తెలిపారు. కానీ విగ్రహాన్ని ధ్వంసం చేశామని కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న దుష్ప్రచారాలు నిరాధారమని స్పష్టం చేశారు. ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అంబేద్కర్ సంఘం నాయకులు గొర్లపల్లి విజయ్, దుర్గం శ్రీనివాస్, గొర్లపల్లి వెంకటేశ్, గోమాస తిరుపతి, గంగారాం, పాపయ ప్రకాశ్ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

చెన్నూర్, జూలై 18 : రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్ గౌడ్ అన్నారు. చెన్నూర్‌లో ఆయన మాట్లాడారు. అస్నాద్ గ్రామంలోని రైతులకు, అలాగే కోటపల్లి మండలంలోని 16 గ్రామాల్లో వెయ్యి ఎకరాల వరకు గిరిజనేతర రైతులు పోడు భూములు సాగు చేసుకుంటున్నారని, వారందరికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వం గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వగా, ఆ భూముల్లో యంత్రాల ద్వారా సాగు చేయవద్దని అటవీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు జాడి తిరుపతి, మంత్రి రామయ్య, రాపర్తి వెంకటేశ్వర్, కొండపాక చారి, శివకృష్ణ పాల్గొన్నారు.

నెన్నెల : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ప్రసాద్

సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాఠశాలలో ఎస్ఐ సుగుణాకర్

దండేపల్లిలో ఎస్ఐ ఉదయ్‌కిరణ్..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దు
- డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు కృషిచేయాలి
- ఆయా పాఠశాలల్లో ఎస్ఐల అవగాహన

బెల్లంపల్లి, జూలై 18 : యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అష్టలుద్దీన్ సూచించారు. ఏఎంసీ గ్రౌండ్‌లో గురువారం యువకులకు టూటౌన్ ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. తాళ్లగురిజాల ఎస్ఐ నరేశ్, పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

నెన్నెలలో..

నెన్నెల, జూలై 18 : నెన్నెల జడ్పీఎస్ పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ ప్రసాద్ అవగాహన కల్పించారు. ఉన్నతంగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో..

చెన్నూర్ టౌన్, జూలై 18 : చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలుర కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ నిర్మూలనపై ఎస్ఐలు శ్వేత, సుబ్బారావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే పోలీసుల లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

కోటపల్లిలో..

కోటపల్లి, జూలై 18 : కోటపల్లి మండలం పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ నియంత్రణపై ఎస్ఐ రాజేందర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్‌లో..

సీసీసీ నస్పూర్, జూలై 18 : సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ఎస్ఐ నెల్కి సుగుణాకర్ డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో కళాశాల, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో..

శ్రీరాంపూర్, జూలై 18 : శ్రీరాంపూర్ కాలనీ విశ్వశాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు ఎస్ఐ సంతోష్ మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. యువకులు గంజాయి, డ్రగ్స్ వినియోగం ఒక సోషల్ స్టేటస్‌గా, ఫ్యాషన్‌గా భావిస్తూ, జీవితాలు పాడు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, కరస్పాండెంట్ జక్కెన రమేశ్ పాల్గొన్నారు.

హాజీపూర్‌లో..

హాజీపూర్, జూలై 18 : హాజీపూర్ మండలం వేంపల్లి ఎస్ఆర్ఆర్ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఎస్ఐ గోపతి సురేశ్ అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్‌బారిన పడి తమ బంగారు భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లిలో..

దండేపల్లి, జూలై 18 : దండేపల్లి ప్రభుత్వ కళాశాల, జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఐ ఉదయ్‌కిరణ్ మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శంకర్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

కాసిపేటలో..

కాసిపేట, జూలై 18 : కాసిపేట మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులకు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ గంజాయి, మాదక ద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపూర్ కుమ్రం భీం చౌక్ వద్ద ఎస్ఐ ఆంజనేయుల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అందె నాగ మలయ్య, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రుణమాఫీ సంబురాలు

జైపూర్ : ఇందారం రైతువేదికలో మాట్లాడుతున్న పెద్దపెల్లి ఎంపీ వంశీ కృష్ణ

హాజీపూర్ : గుడిపేట రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు

జైపూర్/లక్షెట్టిపేట/హాజీపూర్/జన్నారం/జైనూర్/చింతలమానేపల్లి/నెన్నెల/కోటాల/దహెగాం/రెబ్బెన/పెంచికల్‌పేట్/కాగజ్‌నగర్/మందమర్రి రూరల్, జూలై 18 : జిల్లాలో రైతు రుణమాఫీపై అన్నదాతలు, నాయకులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. జైపూర్ మండలంలోని ఇందారం రైతువేదికలో నిర్వహించిన వీసీకి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని పేర్కొన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట.., లక్షెట్టిపేట పట్టణంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సంబురాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పాల్గొన్నారు. జన్నారం మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, రైతులు, నాయకులు ర్యాలీ తీశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పొనకల్ రైతు వేదికలో వీసీలో పాల్గొన్నారు. జైనూర్ మండల కేంద్రంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నాయకురాలు ఆత్రం సుగుణక్క ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని వంజిరి, నెన్నెల మండలం చిత్తాపూర్ రైతు వేదికల్లో.., కౌటాల మండలంలోని అన్ని గ్రామాల్లో.., దహెగాం, రెబ్బెన, వేమనపల్లి మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో నిర్వహించిన వీసీలో నాయకులు, రైతులు పాల్గొన్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి అధికారులు, రైతులు నామమాత్రంగానే హారయ్యారు. మందమర్రి మండలం శంకరపల్లి జీపీ పరిధి రైతు వేదికలో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

చింతలమానేపల్లిలో ఎమ్మెల్యే పర్యటన

చింతలమానేపల్లి, జూలై 18 : చింతలమానేపల్లి మండలంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు పర్యటించారు. ముందుగా కేజీబీవీని సందర్శించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలను నాటారు. ముందుగా కేజీబీవీ విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఇన్‌చార్జి ఎస్‌వో శ్రీదేవి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రహరీ నిర్మించేలా కృషిచేయాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాల సమస్యలను జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి, ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అక్కడి నుంచి కర్జెల్లిలోని శ్రీ ఓంకార ఆశ్రమాన్ని సందర్శించారు. రాధాకృష్ణులను దర్శించుకున్నారు. ఆశ్రమ అభివృద్ధికి రూ.25 లక్షలు అందజేస్తామని తెలిపారు. బాలాజీ అనుకోడ రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ నిధుల విడుదల వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కోట ప్రసాద్, ఏవో రామకృష్ణ, ఇన్‌చార్జి ఎస్‌వో శ్రీదేవి, నాయకులు ధోని శ్రీశైలం, తిరుపతి, గౌడ్, కొప్పుల శంకర్, మురళి, నవీన్, సాయికిరణ్, సంజీవ్, రమేశ్, వరప్రసాద్, పురుషోత్తం, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

23, 24న ఉచిత వైద్య శిబిరం

శ్రీరాంపూర్, జూలై 18 : సింగరేణి రిటైర్డ్ కార్మికులకు ఈ నెల 23, 24న హైదరాబాద్ కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద ఆమోర్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం డిప్యూటీ ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని విధాల జబ్బులకు వైద్యం అందించనున్నట్లు తెలిపారు. సింగరేణి విశ్రాంత కార్మికులు వారి సీపీఆర్ఎంఎస్ (మెడికల్ కార్డు) వెంట తీసుకొని హాజరవ్వాలని సూచించారు.

పాఠశాలకు గడియారాలు అందజేత

కాసిపేట, జూలై 18 : కాసిపేట మండలంలోని ధర్మారావుపేట ఉన్నత పాఠశాలకు గురువారం మందమర్రికి చెందిన రిటైర్డ్ టీచర్ బొంకూరి అనసూయ 4వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు గోడ గడియారాలు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అనసూయ ఎనలేని సేవ చేశారని ఉపాధ్యాయులు కొనియాడారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అరుణ్ ప్రదీప్, సంధ్య, కిరణ్ సందీప్, శృతి వినయ కుమారి, బాబ్జి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టాలి

కెరమెరి, జూలై 18 : పదవ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే చదువుపై దృష్టి పెట్టాలని డీడీ రమాదేవి సూచించారు. మండలంలోని హట్టి, అనార్‌పల్లి, మోడీ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ యేడాది నుంచి పదోతరగతి విద్యార్థులకు ఆంగ్ల బోధన ప్రారంభించడంతో విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవ్వాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు ప్రేందాస్, బలిరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోమటిచేను శివారులో భూ వివాదం

కాసిపేట, జూలై 18 : కాసిపేట మండలం కోమటిచేను శివారులో గురువారం భూ వివాదం తలెత్తింది. భూమికి సంబంధించిన మోక విషయంలో రెండు వర్గాల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. రెండు వర్గాల వారికి పట్టాలు ఉండగా, భూమికి సంబంధించి సరైన మోక లేదని గొడవలు పెట్టుకుంటున్నారు. ఇద్దరికీ వేర్వేరు సర్వే నంబర్లలో పట్టాలు ఉన్నా మాదంటే, మాదని గొడవలు పడుతున్నారు. దీంతో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు పరిశీలించి, మోకపై పైనల్ చేసే వరకు గొడవలు పెట్టుకోవద్దని సూచించారు.

ముగ్గురికి గాయాలు

దహెగాం, జూలై 18 : మండలంలోని మర్రిపల్లి మూలమలుపు వద్ద గురువారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొట్టుకోవడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. తెలిసిన వివరాల ప్రకారం.. చౌక జీపీ పరిధి ఏనెగూడ గ్రామానికి చెందిన ఇంగిలి రమేశ్, మరో వ్యక్తి బైక్‌పై దహెగాంపైపు వెళ్తున్నారు. గిరివెల్లి గ్రామానికి చెందిన అల్లూరి అనిల్, అల్లూరి శంకర్ దహెగాం నుంచి బైక్‌పై వస్తున్నారు. మర్రిపల్లి మూలమలుపు వద్ద ఢీకొట్టుకోవడంతో రమేశ్, అనిల్, శంకర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు దహెగాం పీహెచ్‌సీ తరలించారు. వైద్యుల సూచనల మేరకు ఇంగిలి రమేశ్‌ను మంచిర్యాలకు, అనిల్, శంకర్‌ను బెల్లంపల్లికి తరలించారు. ఏఎస్ఐ ఉత్తం సంఘటనా స్థలానికి, పీహెచ్‌సీకి వెళ్లి, వివరాలు సేకరించారు.

దరఖాస్తు చేసుకోండి

శ్రీరాంపూర్, జూలై 18 : శ్రీరాంపూర్‌లోని ప్రభుత్వ ఐటీఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి 2వ విడుత అర్హులైన విద్యార్థులు 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024, ఆగస్టు 1 నాటికి 14 ఏండు నిండి, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రూ.100 అప్లికేషన్ ఫీజుతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్‌సీవీటీ ట్రేడ్‌లు కంప్యూటర్ ఆపరేషన్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీఓపీఏ)లో 2 యూనిట్లు ఏడాది కోర్సు, ఎలక్ట్రీషియన్ 2 ఏండ్ల కోర్సు, మెకానిక్ డిజిల్ ఏడాది కోర్సు, ఫిట్టర్ రెండేళ్ల కోర్సు, డ్రాప్ట్‌మన్ సివిల్ రెండేళ్ల కోర్సులకు http://iti telangana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సభ్యత్వం రద్దు

నస్పూర్, జూలై 18 : ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి సభ్యత్వం రద్దు చేసినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాగం శ్రీకాంత్, ఈదునూరి అభినయ్ గురువారం తెలిపారు. ఎస్ఎఫ్ఐ కార్యకలాపాల్లో క్రమ శిక్షణా రహితంగా వ్యవహరించినందుకు, సొంత లాభం కోసం సంఘాన్ని కించపరుస్తూ మాట్లాడినందుకు సభ్యత్వం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఇక నుంచి మిట్టపల్లి తిరుపతికి, ఎస్ఎఫ్ఐకి సంబంధం లేదని తెలిపారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవ్వాలి

నస్పూర్, జూలై 18 : జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్టు టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన రాత పరీక్షలో అర్హత సాధించిన మహిళా అభ్యర్థులు 20న నిర్వహించే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవ్వాలని మంచిర్యాల డీఈవో యాదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాలలోని జిల్లా సైన్స్ కేంద్రంలో సర్టిఫికెట్ వెరిపికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. అర్హత సాధించిన వారి హాల్‌టికెట్ నంబర్లు డీఈవో కార్యాలయ నోటీసు బోర్డుపై అంటించిట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన సదస్సు

జైనూర్ జూలై, 18 : జైనూర్ మండల కేంద్రంలో గురువారం మహిళలకు షీ టీం కానిస్టేబుళ్లు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌కు గురైతే వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షీ టీం హెడ్ కానిస్టేబుల్ సునీత, షీ టీం సభ్యులు రమాదేవి, స్వప్న, సరిత, పోలీస్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 వాయిదా వేయాలి

నస్పూర్, జూలై 18 : ప్రభుత్వం గ్రూప్ 2 పరీక్షను వాయిదా వేయాలని, గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి అభినవ్ డిమాండ్ చేవారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన చేపట్టారు. నాయకుడు అరవింద్‌రెడ్డి, అభ్యర్థులు పాల్గొన్నారు.

300 కిలోల పటిక పట్టివేత

కాగజ్‌నగర్, జూలై 18 : కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో రామగిరి రైలులో గురువారం సోదాలు చేయగా, 300 కిలోల పటిక పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సహకారంతో పటిక పట్టుకున్నట్లు స్పష్టం చేశారు. ఈ సోదాల్లో ఎక్సైజ్ సిబ్బంది, రైల్వే పోలీసు సిబ్బంది ఉన్నారు.

రామగిరి రైలులో పట్టుకున్న పటిక

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

కాగజ్‌నగర్ : సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

కాగజ్‌నగర్, జూలై 18 : రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీ జడ్పీ సెకండరీ పాఠశాల (బాలికల)లో గురువారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఇటీవల ప్రమోషన్లలో మిగిలిన పోస్టులను భర్తీచేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్సీని వెంటనే ప్రకటించి, అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూర్ మండలాధ్యక్షుడు భిక్షపతి, ప్రధానకార్యదర్శి శ్రావణ్‌కుమార్, ప్రాధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైనూర్, జూలై 18 : జైనూర్ మండలంలోని పవర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఏనుగుల భూమన్న, ఆత్రం దత్తు మాట్లాడారు. సీనియర్ ఉపాధ్యాయులు జాదవ్ విలాస్, ఆత్రం తిరుమలేశ్వర్, మెస్రం బావ్‌రావు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్, జూలై 18 : పెంచికల్‌పేట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదును మండలాధ్యక్షుడు యాదగిరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి బండ ఉదయ్‌కిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాటి విజయనిర్మల, జిల్లా ఉపాధ్యక్షురాలు గంగాభవాని, మండల అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు జాఫర్, సీనియర్ ఉపాధ్యాయులు బడే షాహెబ్, అత్మారామ్, ఆఫ్టాబ్, సంతోష్, అర్షియాసుల్తానా, ప్రియాంక, అరుణ, భాగ్యలక్ష్మి, రామకృష్ణ,స్వప్న, రసజ్ఞ, సంతోష్, భారతి, నాగరాణి పాల్గొన్నారు.

అమ్మ మాట-అంగన్ వాడీ బడిబాట

హాజీపూర్ : చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

హాజీపూర్, జూలై 18 : మండలంలోని పడ్తన్‌పల్లిలో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సాధికారత కేంద్రం ఆర్థిక అక్షరాస్యతా నిపుణురాలు లిప్సిక మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంతో పాటు విద్య గురించి వివరించారు. అనంతరం చిన్నారులకు అన్న ప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మణికుమార్, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు ఉన్నారు.

జైనూర్‌లో..

జైనూర్, జూలై 18 : జైనూర్ మండల కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీవో ఇందిరా అంగనవాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పెంటుబాయి, లైలా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి, జూలై 18 : వాంకిడి మండలంలోని బంబార గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ తీశారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆటపాటలతో విద్య నేర్పడం తోపాటు పౌష్టికాహారం అందిస్తామని వివరించారు. టీచర్లు సువర్ణ, సరిత, ఆయాలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మొక్కను సంరక్షించాలి

కాగజ్‌నగర్, జూలై 18 : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారీ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో గురువారం కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుతో మొక్కలు నాటారు. మావన మనుగడకు మొ